# నిజస్వరూపం

— కొచ్చర్లకోట వల్లీశ్రీ

"ఆ బట్ట లెందుకే వేసుకున్నావు! పాడుచేస్తావు. అసలే వర్షాకాలం. బురదలో ఆ లంగా వేసుకోకపోతే ఏం? ఆ ఉన్న ఒక్క మంచి జతా దాచుకో కూడదూ?" అంటున్న బామ్మగారి మాట విన్పించుకో కుండా తన కిష్టమైన లైట్ బ్లూ కలర్ నల్ల బోర్డర్ లంగా, నల్ల ఓణీ, బ్లూ జాకెట్టు వేసుకొని బయలుదేరింది పద్దెనిమదేళ్ళ "కవిత".

అదే సమయానికి అటుగా సైకిల్‌పై వెళ్తున్న "శేఖర్" ఆమెను చూసి "సింపిల్ అండ్ బ్యూటీ" అని మనస్సులో అనుకొని రివ్వున వెళ్ళిపోయాడు. రెండు రోజుల కొకసారి కూరల బాస్కెట్టుతో కనిపించే ఆ అమ్మాయితో స్నేహం చేయాలనే "తపన" శేఖరుకు పెరిగింది. ఏ ముహూర్తాన ఆ అమ్మాయిని చూశాడో గాని అతని కుతూహలం రోజురోజుకీ పెరిగింది.

ఓ రోజు మామూలుగా వెళ్ళే కవితకు "ఏమండీ! మిమ్మల్నే" అనే శబ్దం తన నుద్దేశించి అన్నట్లుగా దగ్గరగా వినిపించి వెనుకకు తిరిగింది. తనూహించినట్లు తననే పిల్చింది.

"ఎందుకూ పిల్చారు?" అంది కవిత.

"అబ్బే! ఏం లేదండీ!"

"ఏం లేకపోతే పనిమీద పోయే మనిషిని పనిగట్టుకుని పిలవడం ఎందుకు?" అన్నది కోపంగా.

"మీతో .... మీతో ...."నీళ్ళు నమిలాడు శేఖర్."

"నాతో మీకేమైనా పని ఉందా?" పనుంటేనే తనని అందరూ పలకరిస్తారు. అందుకనే నేమో అనుకొంది కవిత.

"ఆఁ అవును....నాతో స్నేహం చేయటం మీకిష్టమేనా?"

ముక్కూ మొహం తెలియని ఈతడు సూటిగా 'స్నేహం చేస్తారా' అని అడుగుతాడేమిటి? తనతో ఇంతవరకు అందరూ స్నేహాన్ని కోరేవారేగాని అది స్వార్థంతో కూడినవి. ఇలా ఆప్యాయతతో స్నేహం చేయమని అడిగిన వారేలేరు. కనీస ప్రేమకు నోచుకోని అభాగ్యురాలు తను. స్నేహంతో ప్రేమ పంచుకోవాలని, ఎందరో స్నేహితులతో తను తిరగాలని. అందరి ఆప్యాయతను తను పొందాలనే తన 'తపన' ఈనాటికి నెరవేర బోతున్నది కాబోల్ను. తన కెన్నో ఆశలు, ఆశయాలు ఉన్నాయి. అవన్నీ అడియాశ అనుకున్న తనకు ఒక వెలుగు ప్రసాదించాడేమో భగవంతుడు! తనకో దారి ఇస్తున్నాడని" మనస్సులో అనుకుంటూ నడుస్తున్న ఆమెతో "ఏమీ మాట్లాడరేమిటి? యిష్టంలేదా! స్నేహం చేయటం" అన్న శేఖర్ కు సమాధానంగా.

"అలాగే" అంది కవిత.

ఏమిటి యిష్టంలేని దానికా లేక యిష్టానికి జవాబుగానా అర్థం కాలేదు. సరిగ్గా చెబితే నేనెంతో సంతోష పడ్తాను. మాట్లాడితే

ముత్యాలు రాలుతాయని భయమా?"
అన్నాడు శేఖర్.

"మీరు భలేగా మాట్లాడుతారండీ. నిష్కల్మషమైన, ప్రేమపూరితమైన స్నేహం ద్వారా ఎలాంటి కష్టాలైనా ఎటువంటి అడ్డంకులైనా దాటి వచ్చునంటారు."

"మీ పేరు?"

"కవిత."

"డ్యూటీ" ఆఫీసుకి టైమయింది. నే వెళ్తాను అయితే మళ్ళీ ఎల్లుండేగా కూరల బుట్టతో మీ పునర్దర్శనం. కనుక ఎల్లుండి కలుసుకొందాము."

"రోజూ నన్ను అబ్జర్వ్ చేస్తున్నారన్న మాట."

"ఓ.... నే వెళ్తాను టాటా" - అని రివ్వున వెళ్ళిపోయాడు శేఖర్.

* * *

'అమ్మయ్యా, యిన్నాళ్ళకి ఓ బంగారు 'పిచిక' దొరికింది తనకు!' అనుకొన్నాడు శేఖరు

శేఖరు మధ్యతరగతి కుటుంబానికిచెందిన యువకుడు. అతడు ఎప్పుడూ అనుకొంటుంటాడు, ఒక గొప్పింటి పిల్లతో స్నేహంచేసుకొనైనా తన జీవితం మార్పుచేసుకొని తను సుఖపడాలని. ఆ కోరిక యిప్పుడు నెరవేరబోతోంది. చూడబోతే ఆ అమ్మాయి గొప్పింటి పిల్లలాగే వున్నది ఈ దెబ్బతో బాగా స్నేహంచేసి ఆమెకు చేరువైతే ఆమె ద్వారా తన కుటుంబ స్థితిని మార్పుచేసుకోవచ్చు. ఎందుకంటే తన చిన్నతనం నుంచీ ఒకే పంథాలో జీవనయాత్ర సాగుతోంది. ఈ ఈ స్నేహం వలన తను బంగారు పిచ్చుకై పోవచ్చు. ఆమె పొందు తనకు విందు. స్నేహంతో ఎలాంటి కోరికలైనా నెరవేర్చుకోవచ్చును. వీలైతే పెళ్ళికి సిద్ధపడాలి. ఇలానైతే డబ్బుకి డబ్బు అన్నీ వుంటాయి. ఆ అమ్మాయి కొచ్చే వాటా (డబ్బు) తో హాయిగా వుండొచ్చు అనుకొన్నాడు. తనా

## భోగిమంట

ఎయిర్ కండిషన్ రూముల్లో,
విస్కీరమ్‌ల వెచ్చదనంలో,
మత్తెక్కిన కళ్ళ ఎరుపుదనంతో
ప్రపంచాన్ని పంచరంగుల్లో
గదుల్లో చూసేవాడికేం తెలుసు.
భోగిమంటల
ఎరుపుదనంలో కనబడే
కష్టజీవుల జీవితం
భోగిమంటల వెచ్చదనం!

—గొట్టిపర్తి యాదగిరిరావు

ఎలాగో కష్టపడి బి. యె పూర్తిచేయకల్గాడు. ఏదో గుమాస్తాగిరి వెలగపెడ్తున్నాడన్న మాటేగాని వచ్చే 150 రు॥ల జీతంలో 50 రూపాయలైనా యింటికి పంపాలి. స్వంత ఊరులో చిన్న యిల్లు వుంది పెళ్ళికి సిద్ధంగా వున్న చెల్లెలు, అమ్మ, రిటైరైన నాన్న, యిద్దరు చదువుకునే తమ్ముళ్ళు వున్నారు. వాళ్ళకి నేను పంపే 50 రూ॥ల కోసం మూడు, నాల్గు తేదీలలో ఆ ఊళ్ళో వాళ్ళంతా ఎదురు చూస్తూంటారు యివిగాక నాన్నగారికి 30 రూ॥లు వరకు పింఛన్ వస్తుంది. ఎలాగో వాళ్ళు కాలక్షేపం చేస్తున్నారు. తన దగ్గర

పెట్టుకుందామంటే అద్దె బోలెడు పోసి యిక్కడ కష్టం. అక్కడైతే స్వంతయిల్లు కనుక యింటి అద్దె కల్సొస్తోంది. తనకు మిగిలిన 100 రూ॥ల లోను రూమ్‌రెంట్, యింకొన్ని చిల్లర ఖర్చులు, ఒక పూట భోజనం. యింకా ఎన్నో అనుకోని ఖర్చులు ఇవన్నీ తనెలాగో నెట్టుకొస్తున్నాడు. ఇక మీదట తనకెటువంటి లోటూ ఉండదు. ఎందుకంటే ఈ పిచ్చుకద్వారా తనకు రెండవ పూట భోజనం చెల్లిపెళ్ళి, సంసార పరిస్థితి ఈ సమస్యలన్నీ సమసి పోతాయి. తన జీవిత చక్రం అదృష్ట చక్రంపై తిరుగుతుందేమో! తనతపనతీరబోతున్నది అనుకొన్నాడు శేఖర్.

* * *

అనుకొన్నట్లుగా పార్క్‌లో ఓ రోజు కలుసుకున్నారు. కవితా, శేఖరులు.

పార్క్‌లో ఒకచోట కూర్చున్నారు.

తన గురించి అతనితో అన్నీ మనసారా చెప్పుకోవాలని ఏ రోజు కా రోజే ఊహించు కొంటూ ఏవేవో మాట్లాడుతుందే గాని తన గురించి చెప్పుకోవాలని నోటి చివరి వరకు వచ్చాక ఆపుకుంటోంది కవిత.

ఏమో! నా విషయాలు చెప్తే ఈ కొత్త ఆప్యాయత గల వ్యక్తి దూరం అవుతాడేమో ననే భయం ఆమెలో పాతుకుపోయింది.

"కవితా, ఏమన్నా విషయాలు చెప్పవా?"

"ఏం చెప్పనూ!"

"నీ యిష్టం. సరదా అయిన మంచి విశేషాలు."

యిప్పుడే, తనకు మంచి అవకాశం దొరికింది తన గురించి చెప్పేసుకోవాలని సంభాషణ యిలా ప్రారంభించింది.

"వరకట్నం, అనే విషయంపై మీ అభిప్రాయం చెప్పగలరా?"

"'పంపావ్' నాకు చెడ్డ చిరాకు. యింకేం దొరకలేదా నీకు?"

"పోన్లెండి వద్దు."

"అబ్బే! చెప్తాను, నీ కోసం. నువ్వడగటం ఈ శేఖర్ కాదనటమూనా!

"మీకిష్టం లేకపోతే వద్దు."

అహఁ, అలా కాదు. మనిద్దరం స్నేహితులం. ఒకరి కొకరు కావలసిన విషయాలు చెప్పుకోవాలి. సమస్యలుంటే తిర్చుకోవాలి. అర్థం చేసుకోవాలి తెలిసిందా!

'వరకట్నం'అనే మాటేయిష్టంఉండదు.—

"కట్నం తీసుకొన్న మొగవాడు ఆడదానికి అమ్ముడుపోయినట్టుగానే భావిస్తాను. సమాన హక్కులు అంటూ స్త్రీలలో కొందరు 'కట్నంయిచ్చి మేం భర్తలని కొనుకొన్నాం' అంటున్నారు. వనిత వరుని కొనుక్కున్నాం అంటే, 'అంత కట్నం తీసుకోవటం ఎందుకో తెల్సా! కట్నం డబ్బుతో నిన్ను ఆజన్మాంతం పోషించటానికీ అంటున్నారు కొందరు మొగవాళ్ళు. ఏదిఏమైనా యివ్వటం, తీసుకోవటం అనేది కట్నం విషయంలో మంచిది కాదు అని నా అభిప్రాయం."

"అమ్మయ్యా! నా కలలు పండేరోజు, నా తపన తీరే రోజు అదృష్టం పండే రోజు వస్తున్నది కాబోలు, కనుకనే ఇంత మంచి హృదయం, ఆదర్శం కల యువకుడు లభించాడని మనస్సులో ఆనందిస్తున్న కవిత పైకి 'మీరు చాలా ఆదర్శహృదయులు, నాకెంతో నచ్చారు. నా అభిప్రాయాలు మీ అభిప్రాయాలు ఒక్కటే! అనిచిరునవ్వునవ్వింది.

"ఏకాభిప్రాయాలు గలవారు పెళ్ళి చేసుకుంటే వారి జీవితం సుఖమయమవుతుంది కదూ శేఖర్."

"అవును." ఇంతకీ అడగటం మర్చిపోయాను కవితా - ఆ మేడ ఎవర్దిది? మీ గురించిన వివరాలడుగుతున్నానని ఏమీ అనుకోకు. మీ అమ్మా నాన్నగార్లు ఎక్కడున్నారు? ఎప్పుడూ నువ్వు తప్ప యింకెవ్వరూ కన్పించరేం ఇంట్లో. చక్కగా నీ ఆస్తికి భాగస్వాములెవరూ లేరుకావును. అని తనమనస్సులోనిది బైటపెట్టాడు శేఖర్.

అమ్మ, నాన్న అని గుర్తుచేసిన అతని

మాటలకు కన్నీళ్ళు తిరిగాయి కవితకు.

"అదేమిటి? కవితా! అలా అయిపోయావ్" కంగారుగా, అడిగాడు శేఖర్ "నీకు చెప్పటం ఇష్టంలేక పోతే వద్దు. ఊరికే సరదాగా అడిగేను మనస్సు కష్టపెట్టుకోకు."

"అబ్బే! ఏంలేదు. యిన్నాళ్ళ మన స్నేహంలో ప్రతిరోజూ నేనే చెప్పాలనుకునే విషయం మీరే అడిగేశారు. చెప్తాను వినండి"—శేఖర్! మీరూహించని నిజం. మీరెరుగని నిజం పచ్చి నిజం నేనీ రోజు చెప్తాను వింటారా!"

"నీ కిష్టం అయితే చెప్పు కవితా!"

రెండు చేతులూ బుగ్గలపై ఆన్చికూర్చున్న అతనివైపు చూస్తూ చెప్పింది కవిత.

"నేను ఒక్కదాన్నే అమ్మా నాన్నలకు. కాని నాకెవరూ లేరీనాడు ఒంటరిదాన్ని అమ్మా, నాన్నపోయి చాలా కాలమయింది నా చిన్నతనంలోనే పోయారిద్దరూను. బోలెడు ఆస్తిని తీరువుగా చేసుకోలేక నాశనం చేసుకొన్నారట. ఆస్తి నష్టం కాగా వాళ్ళు కూడా దేవుని చేరుకొన్నారు నన్నొంటరి దాన్ని చేసి. ఆ పరిస్థితులలో ఒంటరిదాన్నైన నన్ను ఎవరూ ఆదరించక పోవటంతో 'కలో గంజో మాతో పాటే తాగుతుంది' అని దూరపు బంధువులైన బామ్మగారు, బాబయి గారు నన్ను తీసుకొచ్చారు యిక్కడికి. అప్పటినుంచీ యిక్కడే ఉంటున్నాను. వారింట్లో వారితో సమానంగా చూసినా అప్పుడప్పుడు మాటలంటూ ఉంటారు. 'అందరినీ పొట్టనెట్టుకున్నావ్' అంటారు. వారింట్లో పనంతా చేస్తాను. ఎంతపెట్టినా మాటలు రంపపుకోతలైతే భరించడం కష్టం.

"ఇంతకీ ఆమేడ మీ బాబయ్యదా? మీది కాదన్నమాట."

"అవును. మాపేర ఏమి మిగలలేదు నేను తప్ప"

"బాప్రే! ఇంకేం చెప్పకు. నేనెంతో మోసపోయాను. నీవే ఆ యింటి దానివేమో అనుకున్నాను." అని గుక్కతిప్పుకోకుండా అనేసరికి.

"అదేమిటి శేఖర్ అలా అంటావ్?"

"చిల్లిపైసా విలువ చేయని నిన్ను పెళ్ళి చేసుకొని నెత్తికెక్కించుకోనా – అని మనస్సులో అనుకోబోయిన అతని మాటలు పైకే వచ్చేశాయి. కనీసం నలభై వేల కిమ్మత్తు ఉంటుందేమోననే ఆశతో నేను నీ స్నేహం చేశాను. లేకపోతే స్నేహం అంటే అసహ్యం నాకు" అన్నాడు కోపంగా.

"డబ్బుకి, స్నేహానికి లంకె వేసి ప్రేమ కురిపించారా? ఇన్ని ఆదర్శాలు వల్లె వేసిన మీరేనా యిల్లా మాట్లాడేది!" అంది కవిత.

"ఎన్ని అభిప్రాయాలు, ఆదర్శాలు వున్నా డబ్బు ముఖ్యం. కట్నం విషయంలో నా అభిప్రాయం ఏదైనా పిల్లకు తగినంత ఆస్తి ఉండి తీరాలి. ఏమీ లేని దేభ్యం మొహంతో యిన్నాళ్లూ స్నేహం చేసినందుకు నా కాలం వృథా అయినందుకు నేనెంతో సిగ్గుపడుతున్నాను. జీవితంలోనిన్ను కల్సుకోను. నన్ను నీవు కల్సుకోవటానికి ప్రయత్నించకు. శలవ్." అని విసురుగా శేఖర్ వెళ్ళిపోయాడు.

ఏమీ తనకు లేదని తెలిసేసరికి శేఖర్లో ఊహించని విపరీతమైన మార్పు వెంటనే కల్గటం కవితకు ఆశ్చర్యం కల్గించింది. అతని నిజస్వరూపం బయట పడిందని అనుకొంది.

తనేనాడూ వస్తువాహనాలు కోరుకోలేదు. 'ఆప్యాయత, ఆదరణ' కోరుకుంది అవి అతి సామాన్యమైనవి. అవి లోటయినాయి తనకు. చిన్నతనంలో ఏమైనా ఆప్యాయత రుచి చూసిందేమోగాని, తిరిగి కావాలని కోరుకుంది యిప్పుడు తన కోరిక తీరిందని ఉబ్బితబ్బిబ్బైపోయింది. నమ్మింది మోసపోయింది ఛ్ఛ! పిచ్చిశేఖర్. స్నేహం యొక్క పవిత్రతను చెడగొట్టాడు. నెరవేరనివి కోరుకోవడం, బాధపడటం తన తప్పు. తన ఆశాసౌధం కూలిపోయింది. అని ఆలోచించుకుంటూ శేఖర్ వెళ్ళిన వేపుగా రెప్ప వేయకుండా,చూస్తూ నిర్లిప్తంగా కూర్చుండిపోయింది. కవిత.